రంగుల హోలీ

చిన్నపిల్లల సందడి

తిరుపతి, మార్చి 3 ప్రభాతవార్త: రంగుల హోలీ పండుగను తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువకులు, పెద్దలు ఆనందోత్సాహాలతో ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రాంతం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి సమాజంలో ప్రేమ, సఖ్యత, సామరస్య భావాలు పెంపొందించేందుకు హోలీ పండుగ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లోక ప్రభాకర్‌నాయుడు, సుబ్బు యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి ,యువకులు ఉత్సాహంగా జరుపుకున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు దినపత్రిక
వార్త

చంద్రగ్రహణంతో కాణిపాకం ఆలయం మూసివేత

కాణిపాకం, మార్చి 3 ప్రభాతవార్త: చంద్రగహణం సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయాన్ని మంగళవారం ఉదయం నుండి శాస్త్రోక్తంగా మూసివేశారు. ఉదయం 6.20 గంటల వరకు ఆలయాల్లో యధావిధిగా భక్తులకు దర్శనాలు, ఆర్జిత సేవలను కొనసాగించి అనంతరం ఆలయాలను మూసివేశారు. గ్రహణానంతరం సాయంత్రం 6.47 గంటలకు తెరచి ఆలయశుద్ధి పుణ్యాహావాచనం, గ్రహణానంతరం అభిషేకాలు ఏకాంతంగా నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.బుధవారం వేకువజామున 4 గంటలకు ఆలయాన్ని తెరచి భక్తులకు దర్శనాలు కల్పించడంతో పాటు ఆర్జిత సేవలను కొనసాగించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఆలయ పరిసరాలన్ని నిర్మానుష్యంగా మారింది.

చెంగాళమ్మ ఆలయం మూసివేత

సూళ్లూరుపేట, మార్చి 3 ప్రభాతవార్త సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానాన్ని మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మూసివేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఆలయాన్ని శుద్ధి చేసి సంప్రోక్షణ అనంతరం భక్తులకు యధావిధిగా దర్శనం కల్పిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

గ్రహణంతో బోసిపోయిన అలిపిరి

ఉదయం ఆలయం మూత-రాత్రి తెరచుకున్న ద్వారాలు



తిరుమల,మార్చి 3ప్రభాతవార్తప్రతినిధి: చంద్ర గ్రహణం కారణంగా మంగళవారం ఉదయం మూతబడిన తిరుమల ఆలయం,గ్రహణం వీడటంతో రాత్రి 7.30గంటలకు ఆలయాన్ని తెరచి శుద్ధిచేసి భక్తులను దర్శనానికి అనుమతించారు.మంగళవారం ఉదయం 9 గంటలకు ఆలయాన్ని టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు అత్యంత భద్రతతో ద్వారం తలుపులు మూసివేశారు. గ్రహణం వీడటంతో 7.30 గంటలకు ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం చేసి భక్తులను క్యూలైన్లలోకి అనుమతించారు. నిత్యం రద్దీగా ఉండే అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం మంగళవారం ఉదయం ఖాళీగా దర్శనమిచ్చింది.

గ్రహణం సమయం

శివభక్తులకు సుదర్శనం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సందడి

శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త

చంద్రగ్రహణం వేళ జిల్లాలోని చిన్న పెద్ద దేవాలయాలన్ని మూతపడ్డాయి. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన భోళాశంకరుడు ముక్కంటి స్వయంభువగా వెలసిన వాయులింగేశ్వరుని సన్నిధిలో వెలసిన స్వామికి భక్తి శ్రద్ధలతో 'శాంతి అభిషేకం' నిర్వహించారు. సాధారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని ఆలయాలు మూత పడ్డాయి. దాంతో మంగళవారం ఉదయం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పొటెత్తారు. మహా శివరాత్రిని మరపించింది, వచ్చిన భక్తులు తమ పెద్దల పేరుతో తర్పణాలు వదలటం కనబడింది. అంతేకాక బ్రాహ్మణులకు వంటసామగ్రి దానం ఇవ్వటం కనబడింది.

గ్రహణాల సందర్భంగా శాంతింప జేయాలి: గ్రహణం అంటే ఇబ్బంది కల్గించటం అని ఈ సందర్భంగా ఆలయాలను మూసివేసే సంప్రదాయం కాదని శ్రీకాళహస్తీశ్వరాలయ అర్చకులు వేద పండితులు చెబుతున్నారు. గ్రహణానికి ఉపశమనం కల్గించాలని అం దుకే అభిషేకాలు జరుపుతామని చెబుతున్నారు. మంగళవారం గ్రహణ స్పర్శకాలం మధ్యాహ్నం 3.20 గంటలకని, గ్రహణ మధ్య కాలం సాయంత్రం 5.03గంటలకని, మోక్షకాలం సాయంత్రం 5.47 గంటలని నిర్ధారించారు. గ్రహణం మధ్యకాలం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు జరిపి శాంతింపజేసారు.

భక్తులందరికి సుదర్శనం: ఈ ఏడాదిలో వచ్చిన మొదటి గ్రహణం చంద్ర గ్రహణం.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో తెరచి ఉంచిన ఒకే ఒక ఆలయం శ్రీకాళహస్తీశ్వరాలయం. పగలు ఏర్పడ్డ గ్రహణం సందర్భంగా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి భక్తులందరికి సుదర్శనం కల్పించాలని భావించారు. అభిషేకం జరుగుతున్న సమయంలో భక్తులందరికి దర్శనానికి వచ్చిన ప్రతి భక్తునికి అనుమతించారు. ఎవ్వరిని అంతరాలయ దర్శనానికి అనుమతించలేదు. దాంతో వచ్చిన ప్రతి భక్తుడు ఆలయాధికారి నిర్ణయాన్ని అభినందించారు. స్వామి మూలవిరాట్టుకు అభిషేకం జరుగుతుంటే వేలాదిమంది భక్తులు స్వామి నిజరూపదర్శనంతో పాటు అభిషేకం తిలకించారు. పరశురాం గురుకుల్ (ఆచ్చితా స్వామి) వద్ద నాటి మహారాజులు 'నంది నాగరి లిపి'లో లిఖించిన శాసనం ఉంది. దానిని పురావస్తు శాఖ డైరెక్టర్ కె.మునిరత్నం రెడ్డి పరిశీలించారు. ఈ శాసనాన్ని కేంద్ర పురావస్తుశాఖ వద్ద భద్ర పరచటకు పరిశీలించారు. వీటి నకళ్ళను తీసుకున్నారు.అలాగే ఇటీవల శ్రీకాళహస్తీవ్వరాలయం పైభాగాన్ని లీకేజిలు అరెస్టుకు సంబంధించి నిర్వహించిన పనులను ఆయన పరిశీలించారు.

చిత్తూరు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

- కోర్టు నుండి పరుగులు తీసిన న్యాయవాదులు - రంగంలో దిగిన పోలీసు డాగ్ స్క్వాడ్

- ఎక్కడ బాంబులు లేదని నిర్ధారణతో ఊపిరి పీల్చుకున్న కోర్టు సిబ్బంది

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టుకు వచ్చిన కక్షిదారులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. చిత్తూరు కోర్టు భవనాల్లో 14 సెనైడ్ బాంబులు అమర్చడం జరిగిందని ఈ బాంబులు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పేలుతాయని మెయిల్‌లో హెచ్చరించడంతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు కోర్టు నుండి పరుగులు తీశారు. జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు వచ్చిందన్న సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య హుటాహుటిన కోర్టు ప్రాంగణంకు చేరుకొని కోర్టులో వున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులను వెలుపలికి రప్పించడానికి చర్యలు చేపట్టారు. అ క్రమంలో పోలీస్ బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందడంతో వారు సైతం కోర్టు వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. జిల్లా కోర్టుకు ఉదయం మధ్యాహ్నం 12.30 గంటలకు బాంబు బెదిరింపు మెయిల్ రాగా పోలీసులకు 12.50 గంటలకు సమాచారం అందింది. మధ్నాహ్నం 1 గంటలకు కోర్టు ప్రాంగణంకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, డాగ్ స్క్వాడ్ సిబ్బంది చేరుకుని తనిఖీలు ప్రారంభించారు. మధ్యాహ్నం 1 గంటల నుండి ప్రారంభమైన డాగ్ స్క్వాడ్ తనిఖీలు సాయంత్రం 3 గంటల వరకు సాగాయి. ఈ తనిఖీల్లో ఎక్కడ బాంబు పెట్టిన దాఖలాలు కన్పించక పోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. తమిళనాడు రాష్ట్రంకు చెందిన కనిమెయిలీ అనే మెయిల్ ఐడి ద్వారా కోర్టు మెయిల్‌కు మెయిల్ వచ్చింది. అంటే తమిళనాడు రాష్ట్రం నుండి ఈ మెయిల్ రావడంతో ఈ మెయిల్ ఎక్కడి నుండి పెట్టారనే విషయంపై పోలీసులు విచారణ ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులను బెదిరించడానికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కోర్టు మెయిల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ చేశారని భావిస్తున్నారు. చిత్తూరు జిల్లా కోర్టుకు గత ఏడాది సైతం బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్పుడు సైతం కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉలిక్కిపడి కోర్టు వెలుపలికి పరుగులు తీశారు. అప్పుడు సైతం కోర్టు వద్దకు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు వచ్చి విస్తృతంగా తనిఖీలు చేశాయి. అయితే కోర్టు ఆవరణలో ఎక్కడ బాంబు పెట్టిన దాఖలాలు కన్పించలేదు. కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులను బెదిరించడానికి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కోర్టు మెయిల్‌కు మెయిల్ చేశారని అప్పుడు భావించారు. అయితే ఇదే తరహాలో మంగళవారం సైతం చిత్తూరు జిల్లా కోర్టును బాంబులతో పేల్చివేయనున్నట్లు కోర్టు మెయిల్‌లో సమాచారం రావడంతో చిత్తూరు కోర్టు ప్రాంగణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. అయితే యధావిధిగా ఇప్పుడు సైతం కోర్టులో ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

టమోటా ధర పతనం

కిలో రెండు రూపాయలే.. గిట్టుబాటు ధర లేక అడవిపాలు

పలమనేరు, మార్చి 3, ప్రభాతవార్త: పలమనేరులో టమోటా ధరలు పతనమయ్యాయి. కిలో రెండు రూపాయలకు పడిపోవడంతో రైతులు కళ్ళనీళ్ళ పర్యంతమౌతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక రవాణా ఖర్చులు కూడా దక్కక పండించిన పంటలు పట్టణ సమీపంలోని అటవీ ప్రాంతంలో పారబోస్తున్నారు. పట్టణ సమీపంలోని గాంధీనగర్ రహదారిలోనూ సమీప అటవీ ప్రాంతంలోనూ ఎక్కడ చూసినా కుళ్ళిన టమోటాలు దర్శనమిస్తున్నాయి. పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ టమోటా పంటలకు ప్రసిద్ధి చెందింది. రోజూ సుమారు 100 నుండి 150లోడ్ల టమోటాలు అమ్మకానికి వస్తుంటాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుండి రైతులు తాము పండించిన టమోటాలు ఉదయం 5 గంటలకే మార్కెట్‌కు తీసుకు వస్తారు. దాదాపు 60 మంద ఏజంట్లు వేలం పాటల ద్వారా కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన టమోటాలు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమండ్రి, చెన్నై, కేరళ వంటి ప్రాంతాలోని మార్కెట్లకు అమ్మకాలకు తరలిస్తారు. ఐతే నెల రోజులుగా టమోటా అమ్మకాల ధరలు దారుణంగా పడిపోయాయి. పలమనేరులోనే విడిగా చిన్నవ్యాపారులు వందకు 10 కిలోలు, 15 కిలోల వంతున వీధివీధినా వ్యాన్లలో మైక్‌లలో ఊదరగొడుతూ అమ్మకాలు జరుపుతున్నారు. ఇక మార్కెట్లో వేలం పాటల్లో కొనుగోలు చేస్తే 15 కేజీల బుట్ట రూ.20 నుండి రూ.30 లోపే లభిస్తోంది. దీంతో రైతులు గిట్టుబాటు ధరలు లేక పొలాల్లోనే పంటలు వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు ట్రాక్టర్లతో తీసుకు వచ్చి రోడ్లపైన అటవీ ప్రాంతంలోనూ పారబోస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి టమోటా పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కల్తీనెయ్యిపై ఇక లోతైన దర్యాప్తు

శ్రీవారి దర్శనంలో ఏకసభ్యకమిటీ దినేశ్‌కుమార్

తిరుమల,మార్చి 3ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి వాడటం, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన ఉదంతంలో మరింత లోతైన దర్యాప్తు సాగనుంది. ఇందుకోసం నియమితులైన ఏకసభ్యకమిటీ విశ్రాంత ఐఎఎస్‌అదికారి,విశ్రాంత సిఎస్ దినేశ్‌కుమార్ రంగంలోకి దిగారు. మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకున్న దినేశ్‌కుమార్ ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఈ కేసులో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి 45రోజుల్లో నివేదిక ప్రభుత్వానికి అందజేస్తానన్నారు.తన పరిధిలో ఉన్న మేరకు ఈ కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు చెప్పారు. తొలిరోజు మంగళవారం ఉదయం ఎస్వీ విశ్రాంతి భవనంలోనే దినేశ్‌కుమార్ నెయ్యి టెండర్ల రికార్డులు, వివరాలు పరిశీలన చేయడం విశేషం. ఆయన లోతుగా అధ్యయనం చేసి సమగ్ర సమాచారంతో నెయ్యిలో కల్తీ జరగడానికి ప్రధాన కారణాలు, టెండర్లు ఎలా దక్కించుకుని,ఆ తరువాత నిబంధనలు ఉల్లంఘించి సరఫరా చేశారు, నెయ్యిట్యాంకర్లను తనిఖీ చేసి నాణ్యత పరీక్షించకుండానే వినియోగించిన విధానం వంటి అంశాలను ఇప్పుడు పరిగణనలోనికి తీసుకుని విచారణ సాగించనున్నారు.

డిజిటల్ విధానంలో తప్పులు లేకుండా

జనగణన 2027 ప్రక్రియ : కలెక్టర్

తిరుపతి,మార్చి 3ప్రభాతవార్త: జనాభాగణన 2027ప్రక్రియ తిరుపతి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని, డిజిటల్ విధానంలో తప్పులు లేకుండా నిర్వహించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ సూచించారు.మాస్టర్ ట్రైనర్ లను త్వరలో ఎంపిక చేసి ఫీల్డ్ ట్రైనర్ లకు శిక్షణ ఇస్తారని, ఫీల్డ్ ట్రైనర్ లు మండల, మున్సిపల్ పరిధిలో ఛార్జ్ ఆఫీసర్ లకు, సూపర్వైజర్ లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు.మొదటి విడత ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులు మంగళవారం శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయంలోని ప్రకాశం భవన్ లో ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జనాభాగణన 2027 కార్యక్రమం దాదాపు 15 సంవత్సరాల అనంతరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ గతం కంటే భిన్నంగా పూర్తి డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు జనాభాగణన, పర్యవేక్షణ నిర్వహణను రూపొందించిందన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్తకలెక్టర్ ఆర్. గోవిందరావు, శిక్షణ కలెక్టర్ రఘు వాన్సీ,డి ఆర్ఓ నరసింహులు, రాష్ట్ర స్థాయి సెన్సెస్ అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుప్రీజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యనైమిత్తిక పూజలకు కేటాయించిన

180 గ్రామాలు ఎక్కడున్నాయి?

పత్రాలను పురావస్తు డైరెక్టర్‌కు అందిస్తున్న అచ్చితా గురుకుల్. శాసనాలను డీ కోడ్‌కు సిద్ధం చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,మార్చి 3 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దశాబ్దాల కాలం కాపాడిన మిరాసి దారులు స్థానం ముత్తుకుమార స్వామి గురుకుల్ కుటుంబం.ఐదారేళ్ళ వరకు స్థానం కుటుంబానికి చెందిన పెద్దలు పర్యవేక్షించేవారు. చివరకు ఎస్ఎంకె బాబూ గురుకుల్ సారధ్యంలో సాగేది. ఆయన తరువాత ఆ కుటుంబానికి చెందిన వారి సోదరులు పూజలు నిర్వహిస్తున్నారు. అయితే స్థానం కుటుంబానికి చెందిన యువకుడు డాక్టర్ ఎస్ఎంకె

పురావస్తుశాఖ డైరెక్టర్ పరిశీలన శ్రీకాళహస్తీశ్వరుని మిరాసి దారుని ఇంట భద్రపరచబడిన పత్రం పరిశీలన

శాసనానికి సంబంధించి . . . శ్రీకృష్ణదేవరాలయ పరిపాలనా కాలంలో ఆరవీటి వంశస్థులు సామంత రాజులుగా దక్షిణ భారత దేశాన్ని పరిపాలించారు.హంపీ దిగువ ప్రాంతం నుంచి చైన్నై వరకు పరపాలించే అధికారం కల్పించారు.వీరు 1672లో శివాచార్యులకు, ఆలయాల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ చూపారు.ఈ నేపధ్యంలో 180 గ్రామాలను శ్రీకాళహస్తీశ్వరాలయానికి కేటాయించారు. ఈ మేరకు శాసనాలను రూపొందించి శాసనాలను లిఖించి అందుబాటులో ఉంచారు. రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. శాసనాలకు చెదలు పట్టాయి.అయితే శ్రీకాళహస్తీశ్వరాలయ మిరాసి దారులు మాత్రం శాసనాలను భద్రంగా పెట్టుకున్నారు.1974లో నేడు పురావస్తుశాఖ డైరెక్టర్ పరిశీలించిన శాసనాన్ని డీకోడ్ చేయటానికి ఎస్ఎంకె పరశురాం గురుకుల్ రాష్ట్ర పురావస్తుశాఖకు అభ్యర్థించారు. వారు డీకోడ్ చేసారు.

పురావస్తు శాఖ డైరెక్టర్ పరిశీలన: శ్రీకాళహస్తిలోని స్థానం ముత్తుకుమారస్వామికి సంబంధించిన వారసుడు ఎస్ఎంకె పరశురాం గురుకుల్ (అచ్చితా గురుకుల్) వద్ద భద్రపరచబడిన శాసనాన్ని పురావస్తుశాఖ డైరెక్టర్ కె.మునిరత్నం రెడ్డి పరిశీలించారు.అయితే ఈ 'నంది నాగరిలిపి'ని చదివే వారు మిరాసి దారుల కుటుంబంలో డాక్టర్ ఎస్ కృష్ణమూర్తి ఉన్నారు.ఇందులో ఏమి రాసి ఉన్నారో కేంద్ర పురవస్తు శాఖ తేల్చాల్సి ఉంది.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టులపై నిరసన

చిత్తూరుహెల్త్, మార్చి 3 ప్రభాతవార్త: అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలను సోమవారం రాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కరించాలని రోడ్డెక్కిన అంగన్‌వాడీలను మహిళలు అని సైతం కనికరించకుండా అర్ధరాత్రి అరెస్టు చేయడం అన్యాయమన్నారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలు 42 రోజుల పాటు సమ్మె చేసిన సందర్భంగా ప్రస్తుత సిఎం, అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన శిబిరాల వద్దకు వచ్చి తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రస్తుతం విజయవాడ వెళ్ళి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలను దారుణంగా అరెస్టు చేస్తారా! అని నిలదీశారు. మహిళా సాధికారిత అని గొప్పగా చెప్పుకొనే రాష్ట్ర ప్రభుత్వం మహిళలైన అంగన్‌వాడీలను దుర్మార్గంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చిన తరువాత ఒక మాట అన్న చందంగా సిఎం వ్యవహరిస్తున్నారన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వం చేయూత

రామకుప్పం, మార్చి 3 ప్రభాతవార్త

నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోందని క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బందార్లపల్లికి చెందిన రామచంద్రకు మేఘా ఇంజనీరింగ్ కంపెనీ నలభైవేల సాయంతో ఏర్పాటుచేసిన దోభీషాప్‌ను ప్రారంభించారు. సిఎం చంద్రబాబునాయుడు మంచి ఆశయంతో పి4కార్యక్రమంను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హరి, లీలాకుమార్‌రెడ్డి, ఆనందప్ప, గిరి, బంగారుమిత్ర పురుషోత్తం, వినాయకరెడ్డి, సైదాబీ, రవికుమార్ పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న భవనంలో దగ్ధమైన దుంగలు

కుప్పం, మార్చి 3 ప్రభాతవార్త

కుప్పం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న కోల్డ్ స్టోరేజ్ భవనంలో ఏర్పాటుచేసిన దుంగలు ఒక్కసారిగా అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ప్రాంతంలో బాగా ఎండిపోయిన దుంగలకు ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో మంటలు మూడు అంతస్తుల భవనంలో ఉన్న దుంగలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు, సిబ్బంది మంటలను అదుపు చేసే యత్నం చేశారు. అయితే అప్పటికే పూర్తిగా దుంగలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

కేబుల్ వైర్ల దొంగలు అరెస్టు

పెనుమూరు, మార్చి 3 ప్రభాతవార్త:

మండలంలోని పలు గ్రామాల్లోని రైతుల పంట పొలాల్లో కేబుల్ వైర్ల చోరీకి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించిన వివరాల మేరకు ఇటీవల కాలంలో పెనుమూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పంట పొలాల వద్ద బోరు స్టాటర్లు, కేబుల్ వైర్లు దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ మేరకు కొంతమంది రైతులు ఈ దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ శ్రీనివాసులు స్టేషన్ సిబ్బందితో కలిసి ఒక బృందంను ఏర్పాటు చేసి కేబుల్ వైర్ల దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ కేసుకు సంబంధించి ఎర్రవారిపాళెం మండలంకు చెందిన బాలాజీ(27), పెటువూరు మండలం అత్తిపాకులపల్లికి చెందిన ఉదయ్(19)లు అనుమానితులుగా నిర్ధారించారు. వీరిద్దరు మంగళవారం కొత్త రోడ్డు వద్ద కన్పించడంతో ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిద్దరి నుండి 14 వేల రూపాయల విలువైన రాగి వైర్లు, 90 వేల రూపాయలు విలువ చేసే ద్విచక్ర వాహనంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చౌడేపల్లి, మార్చి 3 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మంగళవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితుల కథనం మేరకు...చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో పట్టణంలోని నడివీధి గంగమ్మ ఆలయం వద్ద వెళుతున్న టూవీలర్‌కు కుక్క అడ్డం వచ్చింది. దీంతో స్కూటర్ అదుపుతప్పి కిందకు పడింది. ఈ ప్రమాదంలో చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన శ్రవణ్‌కుమార్(35), పావని(28), మాన్యశ్రీ(8)లకు గాయాలయ్యాయి. వీరిని చుట్టుపక్కల వారు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వారిలో శ్రవణ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా క్షతగాత్రులను ఆసుపత్రిలోకి తీసుకొచ్చిన సమయంలో ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేవరనీ, దాదాపు అర్ధగంటకు పైగా వేచివుండాల్సి వచ్చిందని బంధువులు ఆరోపించారు.

టిటిడి గో సంరక్షణశాలపై ప్రత్యేక దృష్టి : జెఇఓ డా.ఎ.శరత్

పలమనేరు, మార్చి 3, ప్రభాతవార్త:

పలమనేరులోని టిటిడి గోసంరక్షణ శాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టిటిడి జెఇఓ డా.ఎ. శరత్ (విద్య,వైద్యం) అన్నారు. మంగళవారం సాయంత్రం పలమనేరు గో సంరక్షణశాలను ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోశాలలోని పశువులకు సమయానికి నీరు ఆహారం అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 450 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గోశాలలో ప్రస్తుతం 542 పశువులు ఉన్నట్లు తెలిపారు. పశువులను మేత కోసం రోజూఉదయం మధ్యాహ్నం రెండుసార్లు వదలకుండా ఉదయం ఒకే సారి వదలి సాయంత్రం తీసుకు రావాలని సూచించారు. ఇప్పటికే 13 ఎకరాల్లో మేత అందుబాటులో వుందని గోశాలకు అనువైన భూమి మరింత గుర్తించి పచ్చిగడ్డి సాగు చేయాలన్నారు. ప్రతిషెడ్డులో పశువులకు అనువైన దాణా, షెడ్ల నిర్వహణ, త్రాగునీటి సరఫరా పరిశుభ్రత, వ్యాధుల నివారణ అందిస్తున్న మందుల వివరాలు రోజువారి నోటీసు బోర్డులో తెలియజేయాలని ఆదేశించారు. బెంగళూరులోని శ్రీశ్రీ గో సంరక్షణశాలను సందర్శించి అక్కడ అమలు చేస్తున్న పద్దతులను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. టిటిడి గోశాల డైరెక్టర్ ఎవిఎస్ శివకుమార్, పలమనేరు ప్రత్యేక అధికారి డా.చైతన్య, వెటర్నరీ మేనేజర్లు

ఘనంగా హోలీ

రైల్వే కోడూరు, మార్చి 3 ప్రభాతవార్త

రైల్వే కోడూరు పట్టణంలో మంగళవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చిన్నారులు హోలీని పురస్కరించుకొని రంగులు చల్లుకుంటూ కేరింతల వేస్తూ హోలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యత, సమానత్వం ప్రతిబింబించే రంగుల కేళి హోలీ పర్వ దినాన్ని జరుపుకోవాలని ఒకరినొకరు ఆలింగనము చేసుకుంటూ రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలలో కోడూరు యువత కేరింతలు కొట్టారు.

లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా ధనంజయులు నాయుడు బాధ్యతల స్వీకరణ

వెదురుకుప్పం, మార్చి 3 ప్రభాతవార్త:

లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా మంగళవారం ధనంజయులు నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఆయన పుత్తూరు డివిజన్‌లో ఆపరేషన్ సెక్షన్‌లో లైన్‌ఇన్స్‌పెక్టర్‌గా ఎస్ఆర్ఆర్.పురంలో విధులు నిర్వహించారు. పదోన్నతిపై వెదురుకుప్పంలో బాధ్యతలు చేపట్టారు. పలువురు సిబ్బంది ఆయనను ఘనంగా దుశాలువతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, విద్యుత్ సమస్యలు పరిష్కరించడంకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రియాజ్ అహ్మద్, శేఖర్ హేమచంద్ర మోహన్ రావు, ఫోర్‌మెన్‌లు భాస్కర్ రవిచంద్ర, ఎల్ఐలు ప్రభాకర్‌నాయుడు, యతీశ్వర్ రెడ్డి, ఎల్ఎంలు శివాజీ నాయుడు, ఉదయ్‌కుమార్, లైన్‌మేన్ మల్లా రెడ్డి, సిబ్బంది కిరణ్ మౌలి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి రోజా పరామర్శ

పుత్తూరు (నగరి), మార్చి 3 ప్రభాతవార్త :

ఇటీవల ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందిన నగరి పట్టణం చింతలపట్టెడ హరిజనవాడకు చెందిన వైసిపి నాయకుడు శేఖర్ కుటుంబాన్ని మాజీ మంత్రి ఆర్.కె.రోజా పరామర్శించారు. మంగళవారం మృతుని ఇంటికి వెళ్లి శేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకుడని, శేఖర్ పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేమని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి చెబుతూ వారికి అండగా వుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేటలో వైకాపాకు షాక్ !!

-తెదేపాలోకి చేరిన అరవై మైనార్టీ కుటుంబాలు !!

కుప్పం, మార్చి 3 ప్రభాతవార్త

కుప్పం పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలో వైఎస్సార్సీపికి ముస్లిం మైనార్టీ నేతలు షాక్ ఇచ్చారు. మైనార్టీ నేత నజీర్, మాజీ వైస్ సర్పంచ్ మహ్మద్‌తో సహా సుమారు అరవై కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. వీరిని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు తదితరులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ ముస్లింలకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది సిఎం చంద్రబాబేనన్నారు. ఇమాం,మౌజన్లకు గౌరవవేతనాలు ఇవ్వడంతో పాటు మసీదులు, స్మశాన వాటికలు, ఈద్గాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కొత్తపేటలో ఇంతమంది తెదేపాలో చేరడం శుభపరిణామమన్నారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, మాజీ ఎంపిటిసి కృష్ణన్‌ల అధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్,కడ సభ్యుడు రాజ్‌కుమార్, షాదీఖానా ఛైర్మన్ సర్దార్, మాజీ ఛైర్మన్ అన్సర్, మతీన్ హజరత్,జిల్లా మహిళా నేత జయమ్మ, ఎఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్, షాదుల్లా, కౌన్సిలర్ జిమ్‌దాము, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్,దేవా తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీతిరుపతి గంగమ్మ ఆలయంలో హుండీల లెక్కింపు

కుప్పం, మార్చి 3 ప్రభాతవార్త

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీలను బుధవారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు వేయడం జరుగుతుందని ఆలయ ఛైర్మన్ బిఎ ఒకె రవిచంద్రబాబు తెలిపారు. జాతర సమీపిస్తున్న తరుణంలో ముందుగానే హుండీలను లెక్కించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. లెక్కింపులో పాల్గొనేవారు విధిగా బనియన్లు ధరించి రావాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తామని కడ సభ్యుడు రామచంద్ర పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సదుమూరు పంచాయతీ హనుమన్న కొటాలు గ్రామంలో ఆయన తన పరిధిలో ఉన్న కుటుంబాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు తప్పకుండా ప్రభుత్వ పథకాల్లో లబ్ధి కలిగించడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నేతలు మోహన్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రకృతిసాగు ఉత్పత్తుల ఎగ్జిబిషన్

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త

కుప్పం సమీపంలోని మంజునాథ కన్వెన్షన్ సెంటర్ వద్ద ప్రకృతి సాగు చేపట్టిన రైతులు ఏర్పాటుచేసిన ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. దాదాపు ఇరవై దాకా షాపులను ఏర్పాటుచేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల ఉత్పత్తులు, పొడులు, ఊరగాయలు, కొర్రలు, సామలు, కూరగాయలు, అరటి, టమోటా,ఆకుకూరలు, మొక్కజొన్న తదితర పంటలను రైతులు ప్రదర్శించారు. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, డిఎఓ మురళి తదితరులు ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ రైతులను ప్రోత్సహించేందుకు పలు రకాల ఉత్పత్తులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో డిపిఎం అమృతవల్లి పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు

శాంతిపురం, మార్చి 3 ప్రభాతవార్త

మండల కేంద్రమైన శాంతిపురంలో హోలీ వేడుకలను మార్వాడీ కుటుంబాలు ఘనంగా జరుపుకున్నారు. రంగుల నీళ్ల ఇకరిపై ఒకరు చల్లుకుని కేరింతలు వేశారు. స్థానికులు సైతం వీరికి జత కలిశారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా సంబరాలు జరిగాయి.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

బైరెడ్డిపల్లి, మార్చి 3 ప్రభాతవార్త

ఛలో విజయవాడలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లను అరెస్ట్ చేయడంతో మంగళవారం బైరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఐఎఫ్‌టియు కార్యదర్శి వెంకటరత్న అధ్వర్యంలో నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో కార్యకర్తలను అరెస్ట్ చేయడం తగదన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని పేర్కొన్నారు.

చంద్రగ్రహణం అనంతరం ఆలయాల్లో విశేష అభిషేకాలు

పుత్తూరు రూరల్, మార్చి 3 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో రాత్రి 7 గంటలకు గ్రహణం అనంతరం ఆలయాలను శుద్ధి చేసి స్వస్తి పుణ్యవచనం అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే అర్చనలు చేశారు. పట్టణంలోని శ్రీ సదాశివేశ్వర స్వామి, ఓం శక్తి ఆరేటమ్మ, కావమ్మ మారయ్య శ్రీ నాగాలమ్మ దేవాలయం, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, వినాయకస్వామి ఆలయాల్లో విశేష అభిషే కాలు, అలంకరణలు చేశారు. అలాగే మండల పరిధిలోని తొరూరు,నేసనూరు, వేపగుంట, వేణు గోపాలపురం, కోనప్పగుంట ఆలయాల్లో విశేష పూజలు చేశారు. భక్తులు స్వామివారికి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చదవాలి

పాకాల, మార్చి 2, ప్రభాతవార్త

ఈ నెల 16వ తేదీ నుండి మొదలయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి గురికాకుండా మానసికంగా సన్నద్ధం కావాలని పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. ఆయన మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామలచెరువులో పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల్లో భయాన్ని పోగొట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మానసికంగా చాలా దృఢంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల హాల్ టికెట్స్ పాఠశాలల వ్యక్తిగత లాగిన్‌లో పెట్టడం జరిగిందని వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డౌన్లోడ్ చేసుకొని ప్రింట్ తీసి హెడ్ మాస్టర్ సంతకం పెట్టి విద్యార్థులకు అందచేయాలని కోరారు. ఉపాధ్యాయులు గిరి బాబు, వెంకటేశు, ఉదయ్, సి.ఆర్.పి .శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైకాపా నీచ రాజకీయాలు మనుకోవాలి...?

శ్రీకాళహస్తి మార్చి 3 ప్రభాతవార్త

వైకాపా పార్టీ తమ రాజకీయ లబ్ది కోసం,డైవర్సన్ పాలిటిక్స్ కోసం,కక్ష సాధింపుల కోసం తమ సోషల్ మీడియాలో టిడిపికి చెందిన ప్రముఖులపై డీప్ ఫేక్ వీడియోలతో ఏఐటెక్నాలజీ ద్వారా వారి వ్యక్తిత్వాలను హననం చేస్తూ నీచ రాజకీయాలు చేస్తుండటం దారుణం,అనైతికం అని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు టిటిడి పాలనా వ్యవహారాలలో పారదర్శకంగా,నీతి నిజాయితీ గా నిబద్ధతతో తన విధులు నిర్వహిస్తున్నారని బిఆర్‌నాయుడు టిటిడి ఛైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన రోజు నుండే వైసీపీకి చెందిన నాయకులు విమర్శిస్తుండడం,తను టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటినుండి తిరుమల పవిత్రతకు,సామాన్య భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తూ, వైకాపా పాలనలో టిటిడిలో జరిగిన అవినీతి,అక్రమాలను ఒకొకటిగా వెలుగులోకి తీసుకు వస్తుండటంతో ఇందుకు బాధ్యులు అయిన వైకాపా నాయకులు ఆయనపై కక్ష కట్టి ఆయనపై దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. తిరుమల కల్తీ లడ్డు వ్యవహారం లో సిబిఐ ఛార్జ్ షీట్ దాఖలు చేయడం , సిబిఐ ప్రభుత్వం కు పంపిన నివేదిక పై అధ్యయనం చేసి నాటి పాలక వర్గం సభ్యులు , అధికారులు పాత్ర పై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వన్ మ్యాన్ కమిషన్ నియమించడం , ఆ కమిషన్ విచారణ చేపట్టనున్న సమయంలో తమ పాపాల పై మరిన్ని ఆధారాలు వెలుగులోకి వస్తాయని చర్యలు యుంటాయి అని డైవర్సిన్ పాలిటిక్స్ కి దిగుతూ ఛైర్మన్ పై కక్ష గట్టి ఆయన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడానికి దుష్ప్రచారంకు దిగారనీ, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

ప్రజా సంక్షేమానికి బాటలు

- దేశాభివృద్ధిలో భాగస్వాములు - పాత్రికేయులకు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపు

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పాత్రికేయులు, మీడియాకు వుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. చిత్తూరులోని ఓ హోటల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడలోని పిబిఐ సంస్థ మంగళవారం 'వార్తాలాప్-మీడియా వర్క్‌షాప్' నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పిబిఐ డైరెక్టర్ సురేష్‌కుమార్, ఎల్డీఎం హరీష్, డ్వామా పిడి రవికుమార్, రాష్ట్ర విబి-జి రామ్-జి యాక్ట్ గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సరైన సమాచారం చేరినపుడే అభివృద్ధి ఫలాలు అందరికి చేరుతాయన్నారు. గ్రామీణ స్థాయిలో కేంద్ర పథకాలపై అవగాహన పెంచడానికి విలేకరులు ముందుభాగంలో వుండాలన్నారు. రాష్ట్ర విబి-జి రామ్-జి ప్రతినిధి గోపిచంద్ మాట్లాడుతూ నీటి సంరక్షణ, చెరువుల పునరుద్దరణ, గ్రామీణ రహదారుల నిర్మాణం, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలకు మద్దతు, మహిళల ఉపాధి భాగస్వామ్యం పెంపు, డిజిటల్ పర్యవేక్షణ, బయోమెట్రిక్ హాజరు విధానం, గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రణాళికలు రూపల్పన, జియో ట్యాగింగ్, ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థ, సామాజిక ఆడిట్ ద్వారా పారదర్శకత, నేరుగా లబ్దిదారుల ఖాతాలకు వేతనాల జమ, విబి-జి రామ్-జి ద్వారా ఉపాధి హామీతో పాటు స్థిరమైన గ్రామీణ మౌళిక వసతుల నిర్మాణం జరుగుతుందన్నారు. ఇది వికసిత్ భారత్-2047 లక్ష్యంను దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో అర్ధగిరి ఆలయం మూసివేత

తవణంపల్లె, మార్చి 3 ప్రభాతవార్త:

పాక్షిక కేతు గ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీఅర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయాన్ని మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా మూసివేశారు.మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు పాక్షిక చంద్రగ్రహణం సంభవించడంతో ఉదయం 9 గంటలకు ఆలయంను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా మూసివేశారు. ఆలయంలో పౌర్ణమి వేడుకల సందర్భంగా ఉదయం 9 గంటల వరకు ఆలయంలో భక్తులకు దర్శనం కల్పించడంతో పాటు అన్ని రకాల ఆర్జిత సేవలను నిర్వహించి ఉదయం 9 గంటలకు మూసి వేశారు.గ్రహణానంతరం రాత్రి 8 గంటలకు ఆలయాన్ని తెరచి ఆలయశుద్ధి, సంప్రోక్షణ పుణ్యాహావాచనం స్వామివారికి గ్రహణానంతరం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు 8.30 గంటల నుండి మూలమూర్తి దర్శనం కల్పించనున్నారు. ఈమేరకు రాత్రి 8.30 గంటల నుండి ఆలయంలో అన్ని కార్యక్రమాలు యధావిధిగా జరుగుతుందని ఆలయ ఛైర్మన్ రఘుపతి, ఈఓ ఇ.మునిశేఖర్‌లు తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయానికి భక్తుల రాక తగ్గి బోసిపోయింది.

సైబర్ నేరగాడి కోసం పోలీసుల గాలింపు

పలమనేరు, మార్చి 3, ప్రభాతవార్త:

పలమనేరులో గుర్తు తెలియని సైబర్ నేరగాడు హల్‌చల్ చేశాడు. వారం రోజుల క్రితం పలమనేరులో రవీంద్రారెడ్డి అనే వ్యక్తి బస్సు ఎక్కుతుండగా వెనక నుండి గుర్తు తెలియని వ్యక్తి ప్యాంట్ జేబులో వున్న సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. వెంటనే రవీంద్రరెడ్డి బస్సు దిగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐతే అప్పటికే గుర్తు తెలియన వ్యక్తి పరారీ అయ్యాడు. సిసి పుటేజీ ద్వారా ఇతని కదలికలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. గూగుల్, ఫోన్‌ప్లే, పెటిఎం టెక్నాలజీల ద్వారా రూ.62 వేలు కాజేసినట్లు గుర్తించారు. బ్యాంకర్ల సహాయంతో ఇతని అకౌంట్‌లను పోలీసులు బ్లాక్ చేశారు. సిసి పుటేజీల ద్వారా ఈ మాయగాడి కోసం వేట సాగించిన పోలీసులు చివరకు మదనపల్లెలో ఓ సెల్‌ఫోన్ దుకాణంలో గుర్తించి సిసి పుటేజీ విడుదల చేశారు. ఇతడు కనిపిస్తే 9440796734కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. పలమనేరు డిఎస్పీ దేగల ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎస్ఐ లోకేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడి కార్యకర్తల ధర్నా

పలమనేరు, మార్చి 3, ప్రభాతవార్త:

ఎఐటియుసి ఆధ్వర్యంలో పలమనేరు ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడి కార్యకర్తలు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే జీతాలు పెంచాలని పనికి తగ్గ వేతనం ఇవ్వాలని పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడి కార్యకర్తలతో వెట్టిచాకిరీ చేయించుకుంటోందని పలుమార్లు దీనిపై ఆందోళనలు, ధర్నాలు చేసినా ఫలితం శూన్యమన్నారు. గతంలో 42 రోజుల పాటు ధర్నా చేసినపుడు అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వ భరోసా ఇచ్చిందని ఐతే ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఎఐటియు నాయకులు, అంగన్‌వాడి కార్యకర్తల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బెస్ట్ ఆర్ట్ టీచర్ అవార్డు అందుకున్న కె.రామచంద్రారెడ్డి

చిత్తూరురూరల్, మార్చి 3 ప్రభాతవార్త:

విజయవాడకు చెందిన డ్రీమ్‌యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమి వారు నిర్వహించిన చిత్రకళాపోటీలలో చిత్తూరు జిల్లా బాలభవన్ పర్యవేక్షకులు/ డ్రాయింగ్‌మాస్టర్ కె రామచంద్రారెడ్డి బెస్ట్ ఆర్ట్ టీచర్ అవార్డు, బెస్ట్ స్కూల్ అవార్డును ఏపి సృజనాత్మక సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజేశ్వని, తెలుగు సంస్కృతి అకాడమి ఛైర్మెన్ శరత్‌చంద్ర చేతుల మీదుగా అందుకొన్నారు. రామచంద్రారెడ్డి తమ పాఠశాలల విద్యార్థులచే చిత్రలేఖనపోటీలకు వారు చిత్రించిన చిత్రాలను పంపగా అద్భుతంగా చిత్రించిన విజేతలకు బహుమతులు, అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేసారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్ వాటిని తిలకించి ప్రశంసిస్తూ, చిత్రకళలో నైపుణ్యం సాధించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలిపారు.

కేబుల్ వైర్ల దొంగలు అరెస్టు

పెనుమూరు, మార్చి 3 ప్రభాతవార్త:

మండలంలోని పలు గ్రామాల్లోని రైతుల పంట పొలాల్లో కేబుల్ వైర్ల చోరీకి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసుల

తెలుగువారికి అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే డాక్టర్ థామస్

పాలసముద్రం, మార్చి 3 ప్రభాతవార్త

గత కొన్ని రోజులుగా గల్ఫ్ దేశాలలో ఇరాన్ చేస్తున్న దాడుల గురించి, స్థానిక ఎమ్మెల్యే స్థానిక మండలానికి చెందిన ఖతర్ దోహా దేశంలో నివసిస్తున్న పి .పురుషోత్తం యాదవ్‌కి ఫోన్ చేసి అక్కడ తెలుగు వారి పరిస్థితులను ప్రతి 2 గంటలకు ఒకసారి ఫోన్ చేసి వారి యోగ క్షేమాలను అడుగుతూ అలాగె అక్కడ ఉన్న మన తెలుగువారి కోసం భద్రత సూచనలు ఇవ్వడం తెలుగువారికి ధైర్య సూచనలు ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయమని పురుషోత్తం యాదవ్ తెలియజేశారు. ఇంతగా తెలుగువారి కోసం ఆరాటపడే ఎమ్మెల్యే ఉండటం తెలుగు వారి అదృష్టమని భావిస్తున్నాను. అత్యవసర పరిస్థితులు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే తెలియజేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలియజేశారని మాధ్యమాల ద్వారా విలేకరులకు తెలియజేశాడు.

చంద్రగ్రహణంతో ఆలయాలు మూత

రామకుప్పం, మార్చి 3 ప్రభాతవార్త

మండలంలోని పలు ఆలయాలు చంద్ర గ్రహణం ప్రభావంతో మూసేశారు. సాయంత్రం ఏడు గంటల దాకా ఆలయాలు మూతపడ్డాయి. అనంతరం ఆలయాలను శుద్ధి చేసి భక్తులను అనుమతించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మూతపడ్డ పరశురామేశ్వరాలయం

ఏర్పేడు, మార్చి 3 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా మూతపడింది. సాధారణంగా గ్రహణాల సందర్భంగా ఆలయాలను మూసివేయటం ఆనవాయితి. ఈనేపథ్యంలో మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 8గంటల వరకుభక్తులను అనుమతించారు. తరువాత మూత వేసారు.ఒక వేళ ఎవరైనా భక్తులు తెలియకుండా వస్తే వారు ఇబ్బంది పడకుండా ఆలయ ఛైర్మెన్ బత్తల గిరినాయుడు,ఇఒ రామచంద్రారెడ్డిలో భోజన వసతి కల్పించారు. సాయంత్రం గ్రహణం వీడిన తరువాత ఆలయ శుద్ధి చేసి స్వామి అమ్మవార్లకు నైవేద్యం,దీపారాధన నిర్వహించారు.బుధవారం ఉదయం నుంచి దర్శనానికి అనుమతిస్తామని ప్రకటించారు.

జనసేన పార్టీ ఉద్యమి నమోదు జోరు

ఏర్పేడు, మార్చి 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని జనసైనికులు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు,ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దిశ దేశ నిర్దేశం మేరకు భారీ ఎత్తున సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ నేపథ్యంలో మండల స్థాయి నాయకులు వారి పరిధిలో సభ్యత్వ నమోదును చేపట్టారు. మంగళవారం ' ఉద్యమి నమోదు' కార్యక్రమాలను ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ పర్యవేక్షణలో చేపట్టారు. సభ్యత్వ నమోదు కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. మండల పార్టీ అధ్యక్షుడు కిరణ్ రామిశెట్టి పర్యవేక్షణలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కొట్టెసాయి ప్రసాద్ మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం పొందిన వారికి ఎన్నో వెసులుబాట్లు సహాయ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సభ్యత్వం పొందిన వారికి పార్టీ గుర్తింపుతో పాటు పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే కమిటీల్లో బాధ్యతలు, నాయకత్వ శిక్షణతో పాటు నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని వివరించారు. ఇదే కాకుండా పార్టీ సభ్యత్వం ఉన్న వారికి రూ. 5లక్షల ప్రమాదభీమా సౌకర్యం ద్వారా బాధిత కుటుంబాన్ని ఆదుకునే భరోసా ఉంటుందని వివరించారు. మార్చి 10 వరకు సభ్యత్వ ఉద్యమి కార్యక్రమాలు ఉంటాయని కొట్టె సాయి వివరించారు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు:

శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త

అంగన్‌వాడి ఉద్యమానికి తరలివెళ్ళె కార్యకర్తలను అరెస్టులతో ఆపటం సాధ్యమా? అని సిఐటియుజిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య ఖండించారు. మంగళవారం విజయవాడకు వెళ్ళాలనుకుంటున్న వారి ఇళ్ళ వద్దకుపోలీసులు వెళ్ళి వారిని వాకబు చేయటం అరెస్టులకు నిర్ణయించటం ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. ఉద్యోగులు తమ డిమాండ్స్ సాధనకు ప్రభుత్వానికి తమ డిమాండ్లను వివరించటానికి నిర్ణయించారన్నారు. ఈ నేపథ్యంలో అమరావతిలో శాంతియుత ధర్నా చేస్తున్న అంగన్‌వాడిల ను పోలీసులు బలవంతంగా అదుపులో తీసుకోవటం అక్రమ నిర్బంధానికి నిరసనగా మంగళవారం శ్రీకాళహస్తిలోని ఆర్‌టిసి బస్టాండు సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్‌సర్కిల్ వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్టియు సారధ్యంలో భారీ ఎత్తున నిరసన తెలిపారు. ప్రభుత్వం దిగొచ్చి అంగన్‌వాడిల డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఈ నిరసనలో పలువురు అంగన్‌వాడి నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడిలపై దాడి అమానుషం

శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త

అంగన్‌వాడీలపై పోలీసులు మంగళవారం ప్రదర్శించిన దాడి అమానుషం అని వైకాపా నాయకుడు ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఖండించారు. విజయవాడలో ప్రశాంతంగా ధర్నా చేస్తున్న అంగన్ వాడీ కార్యకర్తలపై పోలీసులు వ్యవహారించిన తీరు అమానుషం అని ఆయన ఖండించారు. ప్రజలు తమ కొర్కెలను ప్రభుత్వానికి తెలియజేసుకోవటం కూడా కుదరదా? అని ప్రశ్నించారు. సమస్యలే చెప్పవద్దంటే పాలకులకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. అంగన్‌వాడిల న్యాయమైన కొర్కెల సాధనకు వైకాపా అండగా ఉంటామని శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మణి, ఈశ్వరయ్య, అన్వర్‌బాషా, వెంకటరత్నం, కల్పన, వసంత, వాని, సౌజన్య, సక్కుబాయి, కంఠాఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

(ఫైల్‌ఫోటో)

తొట్టంబేడు మార్చి 3 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం గుండెలి గుంట పంచాయతీ కొత్తకండిగ గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి కొత్త కండ్రిగ గ్రామానికి చెందిన ఎస్ రాజా, అమరావతి గత22 సంవత్సరాల క్రితం వివాహమైంది. అమరావతికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు కుమారులు ఒక కుమార్తె, కుమారుడు విశాల్ ఇంటర్, ప్రేమ్ కుమార్ 7వ తరగతి, కుమార్తె పదవ తరగతి చదువుకుంటున్నారు. కుటుంబ కలహాలు కారణంగా అమరావతి పురుగులు మందు తాగింది. బంధువుల సహాయంతో శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించారు. పరిస్థితి విషమం కావడంతో తిరుపతి రుయా హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. తొట్టంబేడు మండల ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

5న ఉచిత మెడికల్ హెల్త్ చెకప్

శ్రీకాళహస్తి మార్చి 3 ప్రభాతవార్త

ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం ఆధ్వర్యంలో 8వ జన్ ఔషధీ దివాస్2026 కార్యక్రమంలో భాగంగా ఈనెల 5వ తేదీ గురువారం ఉచిత మెడికల్ హెల్త్ చెక్‌హప్ క్యాంప్ కార్యక్రమము శ్రీకాళహస్తి పట్నంలోని ముత్యాలమ్మ గుడి వీధి, ఏడు గంగమ్మ గుడి పక్కన ఉన్న ప్రధానమంత్రి జెన్ ఔషధి కేంద్రంలో ఏర్పాటు చేశారని నిర్వాహకులు సూర్య కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికిడాక్టర్ కే.వెంకట భాస్కర్ ఎంబిబిఎస్ (ఎండి), జనరల్ సర్జన్ అండ్ సీనియర్ మెడికల్ ఆఫీసర్, బి.డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్, హరికృష్ణ, స్టేట్ కోఆర్డినేటర్, ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం, ఆంధ్ర ప్రదేశ్.వీరి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందనీ పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ క్యాంప్ లో ఉచితముగా బ్లడ్ చెకప్ , బిపి చెకప్, వెయిటేజ్ డాక్టర్ సలహాలు, సూచనలు చేస్తానన్నారు.

టపాకాయల గోదాము సీజ్

తొట్టంబేడు మార్చి 3 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని నాయుడుపేట చెన్నై బైపాస్ ప్రక్కనున్న శ్రీ లక్ష్మి గణపతి క్రాకర్స్ టపాసుల గోడౌన్‌ను సీజ్ చేసినట్లు ఎంఆర్ఓ భారతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత మంగళవారం తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ సోమవారం అసిస్టెంట్ కలెక్టర్, తొట్టంబేడు ఎమ్మార్వో భారతి, ఏపీ ఎస్ ఎఫ్ ఓ శ్రీకాళహస్తి వారు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ గోడౌన్ నందు స్టాక్ రిజిస్టర్ మెయింటినెన్స్ , బకెట్లలో డంపింగ్ చేసిన ఇసుక, బ్లూ ప్రింట్, ఎలక్ట్రానిక్ ఎన్ఓసీ , బిల్డింగ్ ప్లాన్లు , ఫైర్ ఎక్స్టెన్షన్స్ సరిగ్గా లేనందున అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ గోదామును సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు.

నాగలాపురంలో ఆలయాలు మూత



నాగలాపురం, మార్చి 3 ప్రభాతవార్త: చంద్రగ్రహణం సందర్భంగా నాగలాపురంలోని శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణస్వామి ఆలయాన్ని టీటీడీ అధికారులు, అర్చకులు ఉదయం 9 గంటలకు మూసివేశారు. రాత్రి 7.30 గంటలకు ఆలయం శుద్ధి చేసి సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేశారు. నాగ లాపురం మండలంలోని సురుటుపల్లి శ్రీ పల్లికొం డేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు కార్తీకేశన్ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మూసివేశారు. గ్రహణ అనంతరం రాత్రి 7.30 గంటలకు ఆలయాన్ని తెరచి శుద్ధి, సంప్రోక్షణ చేశారు. బుధవారం ఉదయం ఆలయ తలుపులు తెరిచి నిత్య పూజలు అనంతరం భక్తులకు యథావిధిగా సర్వదర్శనం ఏర్పాట్లు చేయనున్నట్లు అర్చకులు తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: సీఐటీయూ

పుత్తూరు రూరల్, మార్చి 3 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 2వ తేదీ ఛలో విజయవాడనిర్వహించడం జరిగిందని, అక్కడ శాంతియుతంగా అలంకార్ చౌక్ దగ్గర శాంతియుతమైన ధర్నా నిర్వహిస్తుంటే అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో 3వ తేదీ కూడా ధర్నా కొనసాగిస్తుంటే ఉదయం 5 గంటలకు పోలీసులు వచ్చి లైట్ ఆఫ్ చేసి టెంటును బ్యానర్లను పీకివేసి నిద్రపోయే అంగన్‌వాడీ వర్కర్లను ముకుమ్మడిగా పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్ళడం దారుణమన్నారు. వారికి న్యాయమైన కోరికలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పుత్తూరులో శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌ను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచికతో విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు విజయ్, అంగన్‌వాడీ నాయకురాలు విజయకుమారి, రాధ, కృష్ణవేణి, గంగులమ్మ, ధనమ్మ, లలిత, మోహన్, లక్ష్మి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు పి4 జాబ్ మేళా -కమిషనర్ మౌర్య

తిరుపతి, మార్చి 3(ప్రభాతవార్త: పి4 కార్యక్రమం లో భాగంగా రేపు గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అనైడేడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సంయుక్తంగా జీవకోన లోని విశ్వం స్కూల్లో రేపు గురువారం ఉదయం 9గంటల నుండి నిర్వహించనున్నామని తెలిపారు. హై స్కూల్ టీచర్ బిఇడి (ప్రాధాన్యత), ప్రీప్రైమరీ టీచర్ (డిగ్రీ), హాస్టల్ వార్డెన్ - ఏదైనా డిగ్రీ, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగి ఏదైనా డిగ్రీ, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కంప్యూటర్ పరి జ్ఞానం , కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగి ఏదైనా డిగ్రీ, టెక్నికల్ పోస్టులకు కూడా ఇంటర్వ్యూలు నిర్వ హించబడుతుందన్నారు. 18-35 సంవత్సరాలు వయస్సు వారు.వేతన పరిమితి నెలకు 15 వేల నుండి 50 వేల రూపాయల వరకు ఉంటుంది, ఉద్యోగం కోరుకునే బంగారు కుటుంబాల అభ్యర్థులు నవీకరిం చిన బయోడేటా , సంబంధిత సర్టిఫికేట్లతో హాజరుకావాలి. నమోదు కార్యక్రమం వేదిక వద్ద నిర్వహించబడుతుంది. బంగారు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకి ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనే అర్హత ఉంటుంది.

అభివృద్ధి చేస్తున్నాం... ఆక్రమించలేదు....

రేణిగుంట మార్చి 3 ప్రభాతవార్త

జిపాలెం పంచాయితీ పద్మానగర్‌లో అభివృద్ధి చేస్తున్నాం తప్ప ఆక్రమణలకు పాల్పడలేదని జి పాలెం టిడిపి ఇన్చార్జి సీనియర్ పార్టీ నాయకుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు అవాస్తమని ఖండిస్తూ మంగళవారం జి పాలెం పద్మా నగర్ లో విలేకరులతో రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించకుండా ప్రజా ప్ర యోజనార్థం స్థలాన్ని చదును చేసామన్నారు. సదరు స్థలాన్ని రెవిన్యూ అధికారులు పంచాయతీకి గిఫ్టుగా ఇచ్చినట్లు తెలిపారు. ఆ స్థలంలో ఎస్టి ఎస్సీల గ్రీవెన్స్ అభ్యర్థన మేరకు అధికారుల సూచనలతో పాఠశాల భవన నిర్మాణం కోసం చదును చేసామన్నారు. అంతే తప్ప స్థలాన్ని ఆక్రమించడానికి కాదన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఇచ్చిన వాగ్దానంలో భాగంగా జి పాలెం పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే ఉద్దేశం అన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేయించడానికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తామన్నారు. సమావేశంలో స్థానికులు విద్యా కమిటీ చైర్మన్ సంధ్య, బాబు, ముత్తయ్య, భాస్కర్, కరిముల్లా, లక్షి ్మ, నిరోషా, మంజుల, మహబూబ్ బాషా, దానయ్య, ప్రభాకర్, లీలమ్మ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వీయ సంరక్షణ అలవర్చుకోవాలి: డీఎస్పీ

రేణిగుంట, మార్చి 3 ప్రభాతవార్త

మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వీయ సంరక్షణ అలవర్చుకోవాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు మహిళా లోకానికి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో మంగళవారం ఆర్టిసి బస్టాండ్ ప్రాంగణం నందు అర్బన్ పోలీసులు మహిళలకు స్వీయ సంరక్షణపై అవగాహన కల్పించారు. డిఎస్పి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారన్నారు. భారత ప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి) ద్రౌపతి ముర్ము మహిళ అన్నారు. ఆపదలు సంభవించినప్పుడు మహిళలు తీసుకోవాల్సి న జాగ్రత్తలు చేపట్టవలసిన చర్యలు వివరించారు. బ్యాగు దొంగతనాలు, చైన్ స్నాచింగ్లు జరక్కుండా జాగ్రత్త వహించాలన్నారు. ఒకవేళ జరిగితే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వడమే కాకుండా టోల్ ఫ్రీ నంబర్లు 100,112 వినియోగించుకోవచ్చని తెలిపారు, కార్యక్రమంలో అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై ధర్మారెడ్డి, అర్బన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి తమ సిబ్బందితో రూరల్ పరిధిలోని వివిధ కళాశాలలో విద్యార్థినులకు మహిళ బాలికల చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం నిరసన

రేణిగుంట మార్చి 3 ప్రభాతవార్త

అంగన్వాడీల చలో విజయవాడ కార్యక్రమం భగ్నం చేయడంపై శ్రామిక మహిళ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వెళుతున్న అంగన్వాడీ వర్కర్లను అరెస్ట్ చేయడంపై రేణిగుంట పట్టణంలో అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు సిఐటియు నేతలు నిరసన వ్యక్తం చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకోవడమే కాకుండా అంగన్వాడి వర్కర్ల టెంట్‌కు కరెంట్ లేకుండా చేయడం అమానుషమైన చర్యగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అంగన్వాడి అధ్యక్షురాలు బేబీ రాణి ఎడమ చేయి విరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యుడు కరిముల్లా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మోహన్, శ్రామిక ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, సిపిఎం సీనియర్ నాయకుడు వెంకటరమణ, రేణిగుంట సిడిపిఓ ప్రాజెక్ట్ నాయకులు కవిత, భారతి, సెక్టర్ నేతలు అంబికా, గీత, గౌరీ, లక్షి ్మ, పార్వతి, విజయ, రోహిణి, అశోక్, విజయ, హెల్పర్లు నిర్మల, ఉష తదితరులు ఉన్నారు

అంగన్‌వాడీల అక్రమ అరెస్టులకు ఏఐటియూసి నిరసన

చంద్రగిరి, మార్చి 3 ప్రభాతవార్త:

సమస్యలపై ప్రశ్నించిన అంగన్‌వాడీ వర్కర్స్‌ను అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని ఏఐటియూసి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెవై రాజా అన్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద మంగళవారం ఏఐటియూసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్ల అరెస్ట్‌కు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు తమ న్యాయపరమైన డిమాండ్లు కనీస వేతనం అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడం, ఉద్యోగ భద్రత వంటివి అమలు చేయాలని కోరడం నేరమా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం తన పంథాను ఇదేరీతిన కొనసాగిస్తే పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరాములు, రవి, తదితరులు పాల్గొన్నారు.

15న కళ్యాణ వెంకన్నకు పుష్పయాగం

చంద్రగిరి, మార్చి 3 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు టిటిడి పిఆర్ఓ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వారికి ఫిబ్రవరి 8 నుండి 16 వరకు జరిగిన బ్రహ్మోత్సవాలలో అర్చక పరిచారికులు, అధికారులు, అనధికారులు, భక్తుల వలన తెలిసీ తెలియక ఏవైనా లోపాలు జరిగి వుంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహించడం వలన సమస్త దోషాలు తొలగిపోతాయని విశ్వాసం. ఇందులో భాగంగా మార్చి 15న ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు స్నపన తిరుమంజనసేవ, మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు పుష్పయాగం, సాయంత్రం 5.30 గంటల నుండి 6.30 గంటల వరకు తిరుచ్చి వాహనసేవ నిర్వహిస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన వారు ఇద్దరికి రూ.516/-లు చెల్లించి, సంప్రదాయ వస్త్రధారణలతో పుష్పయాగం సేవలో పాల్గొనవచ్చును. పుష్పయాగం కారణం 15న స్వామి వారి కళ్యాణోత్సవం రద్దు చేశారు.

ఏఐటియుసి రాష్ట్ర 18వ మహాసభలను జయప్రదం చేయండి

– కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

వరదయ్యపాలెం, మార్చి 3, ప్రభాతవార్త



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కండిడని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సత్యవేడు నియోజకవర్గ ఆఫీస్ బేరర్స్ సమావేశం కోటేశ్వరరావు అధ్యక్షతన వరదయ్యపాలెంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభల కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు సాగిస్తున్నది ఏఐటియుసి అని, అనేక పోరాటాలు చేసి అనేక చట్టాలను సాధించిందన్నారు. ఈ మహాసభలలో గడచిన మూడు సంవత్సరాల కాలంలో ఈ రాష్ట్రంలో ఏఐటియుసి సాగించిన పోరాటాలు చేపట్టిన ఉద్యమాలు సమీక్ష నిర్వహించుకుని రాబోయే మూడు సంవత్సరాల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అలాగే నాలుగు లేబర్ కోర్టులకు వ్యతిరేకంగా సాగించాల్సి న పోరాటాలపై భవిష్యత్ పోరాట కార్యక్రమానికి తిరుపతి వేదిక కానున్నదని అలాంటి మహాసభల విజయవంతానికి ఏఐటియుసి నాయకత్వం కదిలి కృషి చేయాలి అని వారు అన్నారు. అలాగే పంచాయతీ మునిసిపల్ భవన నిర్మాణ కార్మికులు స్కీమ్ వర్కర్స్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు సాగిస్తున్న పోరాటాలకు ఏఐటియుసి ప్రత్యక్షంగా పాల్గొంటుందన్నారు. ఈ ఏఐటియుసి సత్యవేడు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శి అన్నా దొరై, చంద్ర, ఏఐటియుసి ఆఫీస్ బేరర్స్ వాణి, సుభాష్, ముని చంద్ర, కోటేశ్వరరావు, సుబ్బు, సుధీర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాలు మూత

పుత్తూరు రూరల్, మార్చి 3 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలు చంద్రగ్రహణం సందర్భంగా మూసివేశారు. సాయంత్రం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆలయాలను మూసివేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలు ఉదయం 9 నుంచి మూసివేసి రాత్రి 7 గంటల నుంచి పూజలు చేశారు.

తిరుపతి డివిజన్

అన్నదాతలకు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

కేవీబీ పురం, మార్చి 3 ప్రభాతవార్త: గత వైసీపీ ప్రభుత్వంలో లాగా వ్యక్తుల ఫోటోలతో కాకుండా ప్రభుత్వ రాజముద్రతో కూటమి ప్రభుత్వం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా కేవీబీ పురం మండలం ఆరె పంచాయతీకి చెందిన 107 మంది అన్నదాతలకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతుల సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరె పంచాయతీలోని సూర్యనారాయణపురంకు సంబంధించి 70 మందికి, బక్కపోతుల కుంట గ్రామానికి చెందిన 37 మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న కొత్త పట్టాదారు పాసుపుస్తకాల్లో ఎటువంటి వ్యక్తుల ఫోటోలు, పార్టీల రంగులు ఉండవని, ప్రభుత్వ రాజముద్ర మాత్రమే పుస్తకంపై ముద్రించి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి రోజా

విజయపురం, మార్చి 3 ప్రభాతవార్త:

మండలంలోని పన్నూరు ఆది ఆంధ్రవాడ వైసీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందరాజు పిన్నమ్మ రాణెమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో మంగళవారం మాజీమంత్రి రోజా ఆ గ్రామానికి వచ్చి రాణెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసీపీ మండల ఉపాధ్యక్షుడు డేగ సతీష్ యాదవ్, సర్పంచ్‌లు కుమార్, బాబు, సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు గోవిందరాజులు, జిల్లు దాసు, దేవా, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

విజయపురం, మార్చి 3 ప్రభాతవార్త:

మంచినీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ లక్ష్మిపతిరాజు తెలిపారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామ ప్రజల దాహార్తి తీర్చడానికి నాలుగు లక్షలు మండల పరిషత్ నిధులు వెచ్చించి కొత్తగా బోరు, మోటారు, పైపులైన్లను ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు మంచినీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని గాండ్ల కండ్రిగ ఏరియాలో ఎన్ఆర్ఈజీఎస్ విధులతో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, జడ్పీ హైస్కూలు అభివృద్ధి కమిటీ చైర్మన్ సురేష్‌రాజు, స్థానిక టీడీపీ నాయకులు రామచంద్రరాజు, సురేంద్రవర్మ, రాజశేఖర్, సుబ్రహ్మణ్యంరాజు, రామరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గాంధీపురంలో శ్రీకామాక్షి సమేత ఆగస్తీశ్వర స్వామి మహా కుంభాభిషేకం

తిరుపతిరూరల్, మార్చి 3 ప్రభాతవార్త:

వైకుంఠపురం ఆర్చి సమీపంలోని శ్రీధనకోటి గంగమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికోత్సా హం నెలకొంది. ఈ నెల 6వ తేదీన కామాక్షి సమేత ఆగస్తీశ్వర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట అష్టబంధన మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవానికి ముందుగా నేడు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విఘ్నేశ్వర పూజ, శుద్ధి-పుణాహావాచనం, గోపూజ, గణపతి లక్ష్మీ నవగ్రహ కళశారాధన, గణపతి హోమం, లక్ష్మీ హోమం, నవగ్రహ హోమం, లఘు పూర్ణాహుతి, దీపారాధన, ప్రసాదాల వినియోగం ఉంటుందని తెలిపారు. సాయంత్రం మృత్యుంజయ హోమం, యాగశాల ప్రవేశం, దేవతల కళశారాధనలు, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, లఘు పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి వచనం, దీపారాధన, ప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. అలాగే ఈనెల 5న గురువారం ప్రత్యేక పూజలు ఉంటాయని వెల్లడించారు.

పాడి రైతులకు సబ్సిడీ పశువుల దాణ పంపిణీ

విజయపురం, మార్చి 3 ప్రభాతవార్త

మండలంలోని పాడి రైతులకు 50 శాతం రాయితీతో మంగళవారం స్థానిక పశువైద్యశాల వద్ద ఎంపీపీ లక్ష్మిపతిరాజు చేతుల మీదుగా పశువుల దాణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం గోకులంషెడ్ల నిర్మాణానికి 90 శాతం ఆర్థిక సాయంతో పాటు రాయితీతో పశువుల దాణ, మొట్ట మొదటిసారిగా ఏఐ ఆధారిత కౌ ఆధార్ సేవలు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీతో పాటు పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు ధనంజయయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, పశు వైద్యాధికారి శివమూర్తి, స్థానిక టీడీపీ నాయకులు రఘు, జయరామరాజు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై అవగాహన

తిరుపతి విద్య, మార్చి 3 ప్రభాతవార్త

తిరుపతి మహిళా పోలీస్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు మహిళా రక్షణ అవగాహన అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ హాజరై మాట్లాడుతూ మహిళ ఇంటికి ఆధారం, సమాజానికి ప్రేరణ, దేశానికి శక్తి అని, అలాంటి మహిళలకు స్వేచ్ఛ, భద్రత, గౌరవం అనేవి వ్యక్తిగత విషయాలు కాదని సామాజిక విషయాలని మహిళ సురక్షితంగా ఉంటే సమాజం సురక్షితంగా ఉంటుందని, సమాజం సురక్షితంగా ఉంటే దేశం సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిలు చెడు ప్రలోభాలకు లోనవ్వకుండా తమ లక్ష్యం మీద దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పి ఎం శ్రీలత మాట్లాడుతూ ఆడపిల్లలు తమకు ఇబ్బందికరమైన, తమను ప్రలోభ పెట్టే పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా వద్దు అని చెప్పడం అలవర్చుకోవాలని చెప్పారు. విద్యార్థినులకు మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ తీసుకుంటున్న వివిధ రకాల రక్షణ చర్యల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ ఇంచార్జి డాక్టర్ బి జ్యోతి, పోలీస్ యూనిట్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ మాధురి, సీఐ తమీమ్ అహ్మద్, ఏఎస్ఐ గిరిజ, అధ్యాపకులు వై సునీత, కే శోభ, ప్రవీణ, విజయ కుమారి, పద్మిని, జయశ్రీ, పోలీసు సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

నిబంధనలతో అసౌకర్యం లేకుండా

కుమారధార తీర్థ ముక్కోటి



తిరుమల, మార్చి 3(ప్రభాతవార్త)ప్రతినిధి: మాఘమాసం పౌర్ణమి వేళ మంగళవారం ఉదయం కుమారధార తీర్థముక్కోటి వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. పూర్తిస్థాయి భద్రత నడుమ ఉదయం 5గంటల నుండి భక్తులను మధ్యాహ్నం 12గంటలవరకేయాత్రికులనుఅనుమతించి సకల ఏర్పాట్లు చేశారు. చిన్నపాటి అసౌకర్యం కలగకుండా చూశారు.

మహిళా దినోత్సవం ముందే వైద్యశిబిరం

తిరుపతి, మార్చి 3 ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మంగళవారం తిరుపతి జిల్లా పోలీసులు వైద్యశిబిరం నిర్వహించారు. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో పరస్పర చర్చా కార్యక్రమం జరిగింది. పోలీస్ యూనిట్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత వైద్య సేవలు అందించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, మహిళా డీఎస్పీ శ్రీలత పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ మాధురి విద్యార్థినులకు ఆరోగ్య సంరక్షణ, పోషణ, మహిళలలో సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యలు ,వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ తమీమ్ అహ్మద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో యువకుడు అనుమానాస్పద మృతి

తిరుపతి, మార్చి 3ప్రభాతవార్త:

తప్పిపోయిన యువకుడు అనుమానాస్పదంగా మురికికాలువలో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానిక ఎస్‌టివినగర్‌లో నివాసముంటున్న దివాకర్ గా గుర్తించారు. సోమవారం రాత్రి నుండి కనపడటం లేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. మంగళవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో పారిశుద్ధ కార్మికులు కాల్వలు శుద్ధి చేసేందుకు చూడగా మృతదేహం కనపడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెతికి తీశారు. మృతుడి మరణం పై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ వైద్యశాలకు తరలించారు. ఈస్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెడ్డిచెరువులో...అక్రమంగా గ్రావెల్ తరలింపు

దొరవారిసత్రం, మార్చి 3 ప్రభాతవార్త: నెలబల్లి గ్రామ పరిధిలో ఇరిగేషన్ శాఖకు చెందిన రెడ్డిచెరువు పొరంబోకు భూమిలో భారీ యంత్రాలు పెట్టి టిప్పర్ లారీలతో అక్రమంగా గ్రావెల్ తరలింపు ఆలస్యంగా వెలుగు చూసింది. గత మూడు రోజుల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా అధికార పార్టీ నాయకుడు అండతో చెరువు పొరంబోకు భూమిలోని విలువైన గ్రావెల్‌ను నెలబల్లి చెరువు నుంచి నాయుడుపేట ప్రాంతంలో రోడ్డు నిర్మాణం పనులకు భారీ మొత్తంలో గ్రావెల్‌ను అక్రమదారులు తరలిస్తున్నారు. దీన్ని అడ్డుకుని చర్యలు తీసుకోవాల్సి న ఇరిగేషన్, రెవెన్యూశాఖలు తమకి ఏమి తెలియనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంకి చెందిన అధికార పార్టీ నాయకుడు భరోసా ఇవ్వడంతో స్థానిక ప్రాంతంకి చెందిన కొందరు నాయకులు నెలబల్లి ప్రాంతంలోని చెరువు పొరంబోకు భూమి నుంచే కాకుండా తెలుగు గంగ 14 ఆర్ మేజర్ కాలువ లైనింగ్ పనులు సైతం ధ్వంసం చేసి అక్రమంగా గ్రావెల్, మట్టిని నాయుడుపేట ప్రాంతంలో రహదారి నిర్మాణంకి తరలిస్తున్నట్లు స్థానికులు తెలియజేసారు. చెరువు పొరంబోకు భూమి అంతా గోతులమయంగా కావడం వలన చెరువులోకి వర్షాకాల సమయంలో సాగు నీళ్ల చేరకుండాపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ తరలింపును అడ్డుకోకపోతే చెరువు పొరంబోకు భూమి, గంగ లైనింగ్ పనులు అంతా నాశనం కావడం బాధాకరమని పలువురు వాపోతున్నారు.

రాజస్తాన్ సేవాసంఘంచే ఉచిత కంటి వైద్యశిబిరం

సూళ్లూరుపేట, మార్చి 3 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని రాజస్తాన్ సేవాసంఘం సహకారంతో చెన్నై మెట్రో మహవీర్, అరవింద్ నేత్రాలయం తిరుపతి వారి సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. స్థానిక జైన్ ప్రార్ధన మందిరంలో నిర్వహించిన ఈ శిబిరానికి వందమంది రోగులను పరీక్షించి 38 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరికి తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కంటి వైద్యశిబిరానికి హాజరైన వారికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాజస్తాన్ జైన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణం కారణంగా ఆలయాలు మూత

నాయుడుపేట, మార్చి 3 ప్రభాతవార్త : చంద్రగ్రహణం సందర్భంగా పట్టణంలోని అనేక ఆలయాలు మంగళవారం మూతబడ్డాయి. పట్టణంలోని గ్రామదేవత పోలేరమ్మతో పాటు శివాలయం, రామాలయం, బ్రాహ్మణ వీధిలో ఉన్న వ్యూహలక్ష్మి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, పిళ్లారిగుడి వీధిలోని వినాయస్వామి ఆలయం, పిచ్చిరెడ్డి తోపులో ఉన్న విజయ గణపతి ఆలయం మండల పరిధిలోని తిమ్మాజి కండ్రిగ గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున అభయానుగ్రహ వెంకటేశ్వరస్వామి ఆలయాలు, ప్రసూనాంభ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయాలను మూసివేశారు. ఆలయాలలో సంప్రోక్షణలు జరిపి యధివిధిగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయాల నిర్వాహకులు వెల్లడించారు.

అంగనవాడీలను అరెస్టు చేయడం దారుణం

నాయుడుపేట, మార్చి 3 ప్రభాతవార్త: తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్వాడీలను అరెస్టు చేయడం దారుణం అంటూ మంగళవారం నాయుడుపేట పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయుడుపేట సిఐటియు కార్యాలయం నుండి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుందా అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి నెలవల శ్యామలమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారానికి రాక ముందు అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేస్తున్న సందర్భంలో వారి శిబిరాలకు వచ్చి కనీస వేతనం ఇస్తామని వరాలు ఇచ్చి గెలిసిన తర్వాత ఇచ్చిన హామీలను మరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయనిర్మల, కళావతి, నాగమ్మ, వాణి, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణమ్మ, సిఐటియు నాయకులు షేక్ అబ్దుల్లా, షేక్ కాలేషా, ఆటో యూనియన్ నాయకులు మస్తాన్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల అరెస్టును ఖండిస్తున్నాం

వెంకటగిరి, మార్చి 3 ప్రభాతవార్త: నిద్రపోతున్న అంగన్వాడి సిబ్బందిని పోలీసులు అరెస్టు చేయడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వడ్డీపల్లి చంగయ్య మండిపడ్డారు. అంగన్వాడీ మహిళలపై విజయవాడలో జరిగిన పోలీసు చర్యను ఖండిస్తూ వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.స్వరూపరాణి లు మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. తెల్లవారుజామున నిద్రలో ఉన్న అంగన్వాడీ మహిళలపై అకస్మాత్తుగా పోలీసులను దింపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్స్ ప్రాజెక్ట్ లీడర్స్, ప్రభావతి సుభాషిని, అన్నపూర్ణ, ఉషా, రమణమ్మ, ఉదయకుమారి, విజయ, పోలమ్మ, నవమణి, సిఐటియు కోశాధికారి నిర్మల, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్, శ్వేత బ్యారక్ నందు మహిళా పోలీసులు, వారి కుటుంబసభ్యులు, మహిళలకు మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంను నిర్లక్ష్యం చేయకూడదని, ఆరోగ్యమే అసలైన సంపద అని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. వ్యక్తిగత, కుటుంబ, సమాజ అభివృద్ధికి మహిళల ఆరోగ్యం ఎంతో కీలకమన్నారు. మహిళలు తమ బాధ్యతల నడుమ ఆరోగ్యంను నిర్లక్ష్యం చేస్తారని, ఆరోగ్య సమస్యలు ఎదురైన తరువాత కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమన్నారు. రోజువారీ జీవనశైలిలో సరైన ఆహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతత, తగినంత విశ్రాంతి ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యం అంటే శరీర దృఢత, ఉల్లాసం, సమతుల్యత అని కేవలం బరువు తగ్గడం ఒక్కటే వుంటే ఆరోగ్యంగా వున్నట్లు కాదన్నారు. ఏఆర్ అడిషల్ ఎస్పీ దేవదాస్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకుని పోలీసు శాఖ ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసు సిబ్బంది, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమంలో రక్తదానం చేశారు. అపోలో హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పోలీసు ఉద్యోగులు, పోలీసు కుటుంసభ్యులు 35 సంవత్సరాలు దాటిన 150 మంది మహిళలకు ఉచితంగా డయాబెటిస్, అర్థోపెడిక్, డెంటల్, గైనకాలజీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషాలు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, ఆర్ఐలు చంద్రశేఖర్, సుధాకర్‌లు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివశంకర్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ జిలానీ భాషా, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అర్ధరాత్రి అరెస్టులు అమానుషం : సీఐటీయూ

సత్యవేడు, మార్చి 3 ప్రభాతవార్త: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఛలో విజయవాడ కార్యక్రమంలో నిరసన కార్యక్రమం చేపడుతున్న అంగన్‌వాడీలను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం నేడు ఉద్రిక్తతకు దారి తీసింది. తమ న్యాయమైన డిమాండ్ల కోసం ధర్నా చౌక్ వద్ద రాత్రంతా నిరసన తెలిపిన అంగన్‌వాడీ కార్యకర్తలను మంగళవారం వేకువ జామున పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడానికి నిరసిస్తూ సత్యవేడు ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీ స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కొనసాగి గోడ గడియారం కూడలి వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మెలుగు రమేష్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసనలు చేపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అరెస్టు చేయడం రాజ్యాంగ విరోధమని పేర్కొన్నారు. సత్యవేడు ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు యూనియన్ కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ నిద్రిస్తున్న మహిళా నాయకులు కార్యకర్తలను పోలీసులు చుట్టూ ముట్టి వాహనాల్లో ఎక్కించి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించడానికి తీవ్రంగా ఖండించారు. తమ న్యాయ మైన డిమాండ్లు నెరవేరే వరకు నిరసనలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ధర్నా కారణ ంగా సత్యవేడులో ప్రధాన రహదారులపై స్వల్ప రాకపోకలు స్తంభించాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయినాథచౌదరి, ఎస్ఐ-2 లావణ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో చర్చించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బలవంతంగా నిరసనను విరమింపచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అరుణాచలం, అంగన్‌వాడీ సత్యవేడు ప్రాజెక్టు అధ్యక్షుడు శాంతి, కార్యకర్తలు మంజుల, కాంతమ్మ, భారతి, రమణమ్మ, సుజన, విజ,అనురాధ, రుక్మిణీ, పూజ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

యువ భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ : ఎంపీ

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త: యువశక్తి భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్-2047 లక్ష్యం సాధ్యమని ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. చిత్తూరు మురకంబట్టు అపోలో యూనివర్సిటీలో మంగళవారం జిల్లా స్థాయి 'వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2026' నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్‌భట్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలలు, విశ్వ విద్యాలయాల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రజాస్వామ్య విలువలు, రాజ్యంగ బాధ్యతలు, జాతీయ అభివృద్ధిలో యువత పాత్ర వంటి అంశాలపై చర్చలు నిర్వహించారు. '50 సంవత్సరాల ఎమర్జెన్సీ- భారత ప్రజాస్వామ్యంకు పాఠాలు' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక యువ పార్లమెంట్ సమావేశం ఆకర్షణగా నిలిచింది. ఎమర్జెన్సీ కాలంలోని పరిమాణాలు, ప్రజాస్వామ్యం బలోపేతంకు అవసరమైన జాగ్రత్తలపై విద్యార్థులు వాదోపవాదాలు సాగించారు. ఈ కార్యక్రమంలోఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ పార్లమెంటరీ వ్యవస్థపై అవగాహన పెంచుకోవడానికి యువ పార్లమెంట్ మంచి వేదిక అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారానే ప్రపంచ మనుగడ సాధ్యమని, డిక్టేటర్లు, మోనార్కుల యుగం అంతరించిందన్నారు. దేశంలో 50 సంవత్సరాల క్రితం ఎమర్జెన్సీ విధించడం వల్ల ఏర్పడిన పరిస్థితులను ఎంపి వివరించారు. ప్రజాస్వామ్య పునాదులు బలంగా వుండాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్‌భట్ మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య చైతన్యం, రాజ్యంగ బాధ్యతలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. న్యాయ నిర్ణేతల బృందం ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రసంశాపత్రాలను అందజేసింది. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందుతారని జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, అపోలో యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్, అపోలో మోడల్ యునైటెడ్ నేషన్స్ క్లబ్ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధ పైపూరు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, యువజన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల

-ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్

తిరుపతి విద్య,మార్చి 3 ప్రభాతవార్త : పదవ తరగతి పూర్తికాగానే మనకు ఇంటర్మీడియట్ మాత్రమే గుర్తుకువస్తుంది. ఆ తర్వాత నీట్,ఎంసెట్ తదితర పోటీ పరీక్షలు రాసి మెడిసిన్,ఇంజనీరింగ్ వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తాం. కానీ పది తర్వాత పాలిటెక్నిక్ బాట పడితే తక్కువ వ్యయంతో అతి తక్కువ సమయంలో సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవచ్చు. మూడు, నాలుగు సంవత్సరాల లోనే మంచి వేతనాలతో ఉన్నతమైన ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందవచ్చు. దీంతో పాటు ఉన్నత టెక్నికల్ ఎడ్యుకేషన్ వైపు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. పలు పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులలో చేరేందుకు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

పది ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు, ప్రస్తుతం పదవతరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అర్హులు. ఆసక్తిగల అభ్యర్థులు హెచ్ టి టి పి ఎస్://పాలీసెట్‌ఏపీ.ఏపీ.జి ఓ వి.ఇన్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ కేటగిరీ విద్యార్థులు ధరఖాస్తు ఫీజు రూ.400, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు రూ. 100 చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఏప్రిల్ 4వ తేదీలోపు పాలిసెట్ కు దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చేనెల 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో తిరుపతితో పాటు ఈ ఏడాది నూతనంగా శ్రీకాళహస్తి, రేణిగుంట, పుత్తూరు, నగరి పట్టణాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి 22వరకు ఉచిత కోచింగ్ ఇవ్వబడుతుందని జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపల్, ద్వారకనాథ్‌రెడ్డి, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల,తిరుపతి వారు తెలిపారు.

హోరెత్తిన హోలీ... సంబరాలు

తిరుపతి విద్య, మార్చి 3 ప్రభాతవార్త: నిత్యం వేద మంత్రాలతో ఘోషించే వేదిక్ వర్సిటీలో హోలీ సంబరాలు ఆకాశాన్నంటాయి.మంగళవారం హోలీ పర్వదినాన్ని పురష్కరించుకుని ఎస్వీ వేదిక్ వర్సిటీలో వేద విద్యార్థులు రంగులు, డీజే పాటలు, రెయిన్ డ్యాన్స్, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వర్సిటీ అధికారుల సూచనమేరకు సహజ సిద్దమైన రంగులతో సంబరాలు చేసుకున్నారు. ప్రధానంగా వర్సిటీలో వేద విద్యను అభ్యసిస్తున్న నార్త్ ఇండియాకు చెందిన విద్యార్థులు పాల్గొని స్నేహపూరిత వాతావరణంలో రంగు నీళ్లను వెదజల్లుతూ హంగామా చేశారు. సోదరభావంతో ప్రాంతాల తారతమ్యం లేకుండా ఒకరినొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ వర్సిటీలోని వసతగృహాల వద్ద విద్యార్థులు హల్చల్ చేశారు.

ప్రహ్లాద్ మోదీకి సాదర స్వాగతం

తిరుపతి,మార్చి 3ప్రభాతవార్త: తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన ప్రహ్లాద్ మోదీకి తిరుపతి బిజెపి నాయకులు స్వాగతం పలికారు. కూటమి నాయకులు బిజెపి గుండాల గోపినాథ్‌రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు ,పార్థసారథి, శ్రీనివాసులు, సింగంశెట్టి సుబ్బరామయ్య ,తిరుత్తని వేణుగోపాల్, నాగరాజు దుశ్శాలువతో సత్కరించారు.

సూళ్ళూరుపేట డివిజన్

దృష్టి లోపం ఉన్నవారికి కంటి అద్దాల పంపిణీ

వాకాడు, మార్చి 3 ప్రభాతవార్త: వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీ పరిధిలోని దళితవాడలో మంగళవారం హోలీ పండుగను పురస్కరించుకొని చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దృష్టి లోపం ఉన్నవారికి కంటి అద్దాల పంపిణీ చేశారు. స్థానిక దళితవాడను స్థానిక దళితవాడలో రెండు రోజుల క్రితం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసి కంప్యూటర్ ద్వారా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించి 20 మందికి ఉచితంగా అతి తక్కువ ధరకు కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, కుంభాల గున్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యా వికాస కేంద్రం ప్రారంభం

వాకాడు, మార్చి 3 ప్రభాతవార్త: మండలం దుగరాజ పట్నం గ్రామ పంచాయతీ లోని అంజలాపురంలో మంగళవారం సాయంత్రం శ్రీభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా వికాస కేంద్రాన్ని వాకాడు మండల పరిషత్ ఉపాధ్యక్షులు వి వెంకట రమణయ్య ప్రారంభించారు. తీర ప్రాంత గ్రామాల్లో శ్రీ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వికాస కేంద్రాలను మత్స్యకారుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చైర్మన్ కోటేశ్వర రావు మాట్లాడుతూ తన చిన్ననాటి ఆర్థిక సమస్యలతో చేయాలన్న దృక్పధంతో విద్యా వికాస కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీభారత్ ట్రస్ట్ చైర్మన్ కె కోటేశ్వర రావు, దుగరాజపట్నం సర్పంచ్ భర్త పూడి మహేంద్ర,కాపులు కె.వచ్చయ్య, ఎ.చిరంజీవి,బాబు, మత్స్యకార సంక్షేమ సమితి కార్యదర్శి కొండూరు వెంకటేశ్వర్లు, మత్స్యకార సంఘం నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ట్రస్ట్ టీచర్లు బలంగారి అమ్ములు,కె రజిత, ఇలేఖ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో టిటిడి పిఆర్ఓకు ప్రథమ బహుమతి

తిరుమల,మార్చి 3ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఉదయం నిర్వహించిన పోటీల్లో టిటిడి పిఆర్ఓ నీలిమ చిత్రలేఖన పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. టిటిడి ఉద్యోగుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. చిత్రలేఖనం పోటీలలో పిఆర్ఓ (ఎఫ్ఏసి) పి.నీలిమ ప్రథమ, శశికళ ద్వితీయ, కుమారి ఇంద్రజ తృతీయ స్థానంలో నిలిచారు. వ్యాసరచన పోటీలలో శ్రీలత ప్రథమ, అలేఖ్య ద్వితీయ, శ్రీలక్ష్మి తృతీయ స్థానంలో నిలిచారు. టిటిడి డిప్యూటీ ఈఓ (సంక్షేమం) ఆనందరాజు ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

కల్యాణ వెంకన్న ఆలయం మూసివేత

-ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి

చంద్రగిరి, మార్చి 3 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేసినట్లు ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాన్ని మూసివేస్తున్నట్లు వివరించారు. గ్రహణం అనంతరం తిరిగి 7.30 గంటలకు అర్చకులు ఆలయాన్ని ఆగమోక్తంగా శుద్ధి నిర్వహించి, తగిన పూజాది నిత్యకైంకర్యాలను నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి ఏకాంత సేవకు భక్తులను అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రాజ్‌కుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, మోహన్ నాయుడు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల దేవుడే శ్రీమంతుడు

-ఏటేటా పెరుగుతున్న హుండీ కానుకలు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడుగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఖ్యాతిచెందాడు. ఆపద మొక్కుల స్వామికి భక్తులు మొక్కుబడుల రూపంలో హుండీకి సమర్పించుకుంటున్న కానుకలు ఏటేటా అనూహ్యంగా రెట్టింపవుతోంది. హుండీ ఆదాయం పరిగణలోనికి తీసుకునే టిటిడి వార్షిక బడ్జెట్‌ను కూడా రూపొందిస్తుంది. గత దశాబ్ధకాలంలో వడ్డీకాసులవాని హుండీ ఆదాయం విశేషంగా పెరగడం భక్తుల ప్రగాఢవిశ్వాసానికి నిదర్శనం. ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో 1,880కోట్ల రూపాయలు హుండీ ఆదాయం సమకూరుతుందని అంచనా వేయడం విశేషం. గత ఏడాది బడ్జెట్‌లో 1,738కోట్ల రూపాయలు ఆదాయం లభించింది.దాన్ని పరిగణనలోనికి తీసుకుని హుండీ ద్వారా అదనంగా 142కోట్ల రూపాయలు ఆదాయం రావచ్చని అంచనా వేశారు. 2015-16 ఆర్థికసంవత్సరంలో 2,530.10కోట్ల రూపాయలు వార్షిక బడ్జెట్ అంచనాలో హుండీ కానుకల ద్వారానే 1,010 కోట్ల రూపాయలు ఆదాయం చేకూరింది. వివిధ బ్యాంకుల్లో పలురకాల డిపాజిట్లపై వడ్డీ రూపేణా 768.04కోట్లు, ప్రసాదాల విక్రయాలు ద్వారా 155కోట్లు రూపాయలు రెట్టింపుగా ఆదాయం లభించింది. 2016-17 వార్షిక బడ్జెట్ అంచనాలకంటే ఆదాయం గణనీయంగా పెరిగింది. హుండీ కానుకల ద్వారా ఆ ఏడాది 1,110కోట్లు రూపాయలు, వడ్డీల ద్వారా 762.58కోట్లు, ప్రసాదాల ద్వారా 165కోట్ల రూపాయలు గడించింది. 2017-18 వార్షిక బడ్జెట్ 2,858.48కోట్లలో 1,110 కోట్ల రూపాయలు హుండీ కానుకల ద్వారా ఆదాయం అంచనా, 2019-20 సంవత్సరంలో హుండీ కానుకల ద్వారా 1,231కోట్ల రూపాయలు, 2020-21 కరోనా కాలంలోనూ ఈ హుండీ ద్వారా ఆదాయం గణనీయంగా చేకూరింది. ఆ ఏడాది హుండీద్వారానే 1,351కోట్ల రూపాయలు ఆదాయం గడించవచ్చని అంచనావేశారు. 2021-22లో 933కోట్ల రూపాయలు హుండీ ఆదాయంగా భావించారు. గడచిన నాలుగేళ్ళలోనూ వరుసగా హుండీ ఆదాయం గణనీయంగా చేకూరింది. 2022-23 వార్షిక బడ్జెట్ అంచనాలో హుండీ కానుకల రూపంలో వెయ్యికోట్లు రికార్డుస్థాయి చేరింది. 2023-24 వార్షిక పద్దులో హుండీ ద్వారానే ఆదాయం 1,611కోట్లు రూపాయలు గడించారు. 2024-25 వార్షిక బడ్జెట్ హుండీకి ఆదాయం 1,671కోట్ల రూపాయలు అనూహ్యంగా గణనీయంగా రికార్డుస్థాయి ఆదాయం చేకూరింది. 2025-26కు ఒక్క హుండీద్వారానే 1,738కోట్ల రూపాయలు ఆదాయం లభించింది .అంచనాలకంటే అదనంగా 67కోట్లు ఆదాయం గడించింది,ఈ ఏడాది తాజా బడ్జెట్‌లో హుండీ ద్వారానే 1,880 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అత్యధిక ధనవంత దేవుడుగా హుండీద్వారా 2వేల కోట్లరూపాయలు ఆదాయం వచ్చినా అతిశయోక్తికాదు.

అడవిలో ఎగిసిపడ్డ మంటలు

-మంటలు ఆర్పిన అటవీ సిబ్బంది

రామకుప్పం, మార్చి 3 ప్రభాతవార్త: ఇటీవల రాష్ట్ర విపత్తుల శాఖ హెచ్చరించిన విధంగానే మండలం లోని అడవుల్లో మంటలు ఎగిసిపడ్డాయి. 10 రోజుల క్రితం అడవుల్లో మంటలు ఎగిసి పడే అవకాశాలున్నాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ హెచ్చరించింది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో రామకుప్పం అటవీ విభాగం కోటచేసు సమీప అడవిలో అకస్మాత్తుగా మంటలు రేగాయి. సమాచారం తెలుసుకున్న ఎఫ్ బి ఓ హరిబాబు, బేస్ క్యాంపు సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటల్ని ఆర్పేశారు. వారు అక్కడ మంటలు ఆర్పుతుండగానే రాత్రి 7గంటల ప్రాంతంలో సుమారు 3 కిలోమీటర్ల దూరంలోని నాయనకుంట అటవీ ప్రాంతంలో మంటలు ఎగిసిపడ్డాయి. కోటచేను వద్ద మంటలు ఆర్పిన తర్వాత అక్కడకు వెళ్ళి రాత్రి 8:30గంటల వరకు శ్రమ పడి మంటలు ఆర్పివేశారు.



మంగళవారం రాత్రి చంద్రుడు స్వామి అమ్మవార్ల ఎదుట నిలిచారు. చంద్ర గ్రహణం వీడిన అనంతరం పున్నమి వెన్నెల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం.
-ప్రభాతవార్త, శ్రీకాళహస్తి